





శ్రీకాకుళంలో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

దున్నపోతుకు అంగన్‌వాడీల వినతి

అరసవల్లి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరికి వ్యతిరేకంగా అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి.. వినూత్న నిరసన తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె కొనసాగించారు. 'మీకో దండం.. ఇప్పటికైనా మా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి' అంటూ సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. 'సమస్యల పరిష్కారం కోరుతూ 21 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. మరోవైపు సమ్మె విరమించి.. కేంద్రాలు తెరవాలంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు' అని అంగన్‌వాడీ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు కె.కల్యాణి స్పష్టం చేశారు. ఈ నెల 5వ తేదీ నాటికి అంగన్‌వాడీలు విధుల్లో చేరకపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని అధికారులు ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. అందుకే దున్నపోతుకు తమ సమస్యలను వివరిస్తూ.. వినతిపత్రం అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి, పెద్దసంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి మండలం ముఖందుపురం అంగన్‌వాడీ కేంద్రంలో ముఖందుపురం, రంగంవీధి, పరశురాంపురం గిరిజన గ్రామాలకు సంబంధించి 15 మంది చిన్నారులు ఉన్నారు. రోజూలాగే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి వెళ్లిపోతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో తమ చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం లేదని గిరిజనులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరితో కేంద్రాలు కూడా సక్రమంగా తెరచుకోవడం లేదని పేర్కొంటున్నారు.

(మెళియాపుట్టి)

'మీకో దండం' అంటూ అంగన్‌వాడీల నిరసన

ఇంకెన్నాళ్లు?

- అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం
- కొనసాగుతున్న కార్యకర్తల నిరవధిక సమ్మె
- సచివాలయాల సిబ్బంది బాధ్యతల అప్పగించినా.. ప్రయోజనం శూన్యం
- సక్రమంగా సాగని కేంద్రాల నిర్వహణ
- చిన్నారులు, గర్భిణులకు అందని పౌష్టికాహారం

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. హామీలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. గత నెల 12 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె బాట పట్టారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా రోజూ వినూత్న రీతిలో నిరసన చేపడుతూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోగా.. కేంద్రాల నిర్వహణ సచివాలయ సిబ్బందికి అప్పగించింది. ఒక్కో కేంద్రానికి ఒక్కొక్కరినీ ఇన్‌చార్జిగా నియమించింది. దీనిపై అంగన్‌వాడీలు మరింత మండిపడుతూ ఆందోళన ఉధృతం చేశారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది కొన్ని చోట్ల కేంద్రాలు స్వాధీనం చేసుకుని.. తాళాలు తెరిచారు. కానీ సక్రమంగా సేవలు మాత్రం అందడం లేదు. కేంద్రాల్లో వంట బాధ్యతను.. సమీప పాఠశాలల్లో వంట చేస్తున్నవారికి అప్పగించాలని అధికారులు చెబుతున్నా.. నిర్వాహకులు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో కేంద్రాలు కూడా సక్రమంగా తెరవడం లేదు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదు.



ముఖందుపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 15 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 36,990 మంది చదువుతున్నారు. వీరితో పాటు 12,229 మంది గర్భిణులు, 13,275 బాలింతలకు పౌష్టకాహారం అందజేయాలి. గిరిజన చిన్నారులకు పోషణ ప్లస్ పథకం ద్వారా పాలు, గుడ్లు పంపిణీ చేయాలి. కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు సంపూర్ణ భోజనం, పాలు అందజేయాలి. గర్భిణులకు వైఎస్సార్ కిట్లు అందజేయాలి. కాగా.. అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో ఇవేవీ అందక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు. కేంద్రాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి ఎంపీడీవో చంద్రకుమారి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. పాఠశాలల వంట నిర్వాహకులతో మాట్లాడి.. పిల్లలకు భోజనాలు పెట్టించేలా ఏర్పాటు చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించామన్నారు. కేంద్రాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లాలో భువనేశ్వరి పర్యటన



భువనేశ్వరి

శ్రీకాకుళం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసిన నేపథ్యంలో.. ఆ వార్త విని ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాలకొండ నియోజకవర్గాల్లో టీడీపీ అభిమానులు కొందరు కలత చెంది మరణించారు. ఆయా కుటుంబాలను పరామర్శించేందుకు గత నవంబరులో భువనేశ్వరి పర్యటన ఖరారైంది. అయితే అదే సమయంలో చంద్రబాబునాయుడుకి బెయిల్ లభించటంతో ఆమె పర్యటన వాయిదా పడింది. ఈనెల 4న జి.సిగడాం, దవళపేట, భామిని మండలం బిల్లమాడ, బూర్జ మండలం తోటవాడ, ఆమదాలవలస మండలం దన్నానపేట, పాత నిమ్మతొర్లవాడలో ఆమె పర్యటిస్తారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

పోరాటం చేస్తున్నా పట్టించుకోరా?

- 199 ఎకరాలపై భూ హక్కు కల్పించండి
- గ్రామసభలో అధికారులను నిలదీసిన తోటాడ రైతులు

ఆమదాలవలస, జనవరి 2: 'మా గ్రామ రెవెన్యూ పరిధిలోని 121 సర్వే నెంబరులో 199 ఎకరాల భూములపై మాకు హక్కు కల్పించాలని మూడు తరాలుగా పోరాటాలు చేస్తున్నాం. ఏ ప్రభుత్వం పరిష్కరించడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు వేడుకున్నా పట్టించుకోవడం లేదు' అని మండలంలోని తోటాడ గ్రామ రైతులు అధికారులను నిలదీశారు. తోటాడ గ్రామంలో చేపట్టనున్న భూ రీసర్వేపై తహసీల్దార్ ఎస్.గణపతిరావు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామ పరిధిలోని 2,200 మంది 199 ఎకరాల వ్యవసాయ భూములను సాగు చేస్తున్నారని, అయితే ప్రభుత్వం వీటిని ఈనాం భూములుగా చూపిస్తూ సాగు హక్కులు కల్పించకుండా తమను మనోవేదనకు గురిచేస్తుందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, కోర్టులు, జిల్లా అధికారులు ఈ సర్వే నెంబరు భూములను జిరాయితీ భూములుగా గుర్తించినట్లు గుర్తు చేశారు. అయినప్పటికీ ఆమదాలవలస తహసీల్దార్ కార్యాలయ అధికారులు మాత్రం రైతులను ప్రతిసారి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మూడు నెలల్లో జగనన్న భూ సర్వే ద్వారా తోటాడ గ్రామ రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. దీనికి ఓ యువకుడు సందిస్తూ.. మూడు నెలల సమయం అంటున్నారని, ఎన్నికల కోడ్ వస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించాడు. ఎన్నికల నిబంధనలు కొత్త పథకాల మంజూరుకు వర్తిస్తాయని తహసీల్దార్ చెప్పారు. ఒకవేళ ప్రభుత్వం మారితే సర్వే పరిస్థితి ఏమిటని ఆ యువకుడు మళ్లీ ప్రశ్నించడంతో తహసీల్దార్ మౌనం వహించారు. గ్రామసభలో సర్పంచ్ మెట్ట శారద, టీడీపీ నాయకులు పొన్నాడ గణపతిరావు, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, భూ సర్వే డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

తొలివిడత సూపర్ అట!

- 637 శిబిరాల్లో 2,67,800 మందికి వైద్య పరీక్షలు చేశారట
- తాజాగా రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం
- ఈ సారి లక్ష్యం 669 శిబిరాలు
- పీహెచ్‌సీ వైద్యులతోనే సేవలు
- ప్రభుత్వాస్పత్రుల్లో నిలిచిపోతున్న సేవలు
- ఫ్యామిలీ డాక్టర్ విధానంలోనూ అంతే..



ఆరోగ్య సురక్ష శిబిరానికి అంతంతమాత్రంగా వచ్చిన రోగులు

(రణస్థలం)

'జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద జిల్లాలో 637 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. 2,67,800 మందికి చికిత్సలు అందించాం. వీరిలో వేలాది మందికి ఉన్నత వైద్యసేవలకు సిఫారసు చేశాం. వందలాది మందికి ఆపరేషన్లు చేశాం' అని అధికారులు గొప్పలు చెబుతున్నారు. ఇదే స్ఫూర్తితో మంగళవారం నుంచి రెండో విడత ప్రారంభించామని పేర్కొంటున్నారు. ఈ ఏడాది జూన్ 30 వరకూ షెడ్యూల్ సైతం ప్రకటించారు. కాగా.. జిల్లాలో ఈ వైద్య శిబిరాలన్నీ ఎప్పుడు ఏర్పాటు చేశారు. ఇంతమందికి ఎప్పుడు వైద్యసేవలు అందించారన్న ప్రశ్నలు ప్రజల నుంచి తలెత్తుతున్నాయి. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందిస్తున్నామని చెబుతున్న అధికారులు జగనన్న ఆరోగ్య సురక్షతో స్వరూపమే మారిపోయిందని ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇటువంటి శిబిరాలు ఏవీ కనిపించలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ప్రత్యేక నియామకాలు లేకుండా..

ఫ్యామిలీ డాక్టర్ విధానమైనా, జగనన్న ఆరోగ్య సురక్ష అయినా వైద్యసేవలందించే ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులే. ప్రత్యేకంగా వైద్యుల నియామకం కానీ.. సిబ్బందిని కానీ భర్తీ చేసిన దాఖలాలు లేవు. ఉన్న ప్రభుత్వ వైద్యులు, సిబ్బందినే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా 104 వాహనంలో పీహెచ్‌సీ వైద్యుడితో పాటు కొంతమంది సిబ్బంది గ్రామాలకు వెళ్లాలి. ఇంటింటా వైద్య పరీక్షలు చేసి రుగ్మతలు ఉన్నవారిని గుర్తించాలి. జబ్బుకు తగ్గట్టు వైద్యం అందించాలి. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నదే ఒకరిద్దరు డాక్టర్లు. దీంతో కొన్నిచోట్ల డాక్టర్ రాకుండానే ఎక్కడో 104 వాహనం పెట్టి తూతూమంత్రంగా సేవలందిస్తున్నారు. దీంతో ఇదో ఆర్భాటపు పథకంగా మిగిలిపోయిందని స్వయంగా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలే చెబుతున్నాయి.

కొత్తగా కంటి వైద్యసేవలు..

ఇప్పుడు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి వైద్యాన్ని సైతం జతచేశారు. ఈ ఆరు నెలల వ్యవధిలో 30 మండలాల్లో 669 వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఒక్కో మండలానికి వారానికి 34 క్యాంపులు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. 15 మండలాల్లో మంగళవారం, మరో 15 మండలాల్లో శుక్రవారం సచివాలయాల వారీగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. మునిసిపాలిటీలకు సంబంధించి ప్రతి బుధవారం మెడికల్ క్యాంపులు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. ఈ నెలాఖరులోగా 147 మెడికల్ క్యాంపులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అంతా అరకొరగానే

ప్రతీ మెడికల్ క్యాంపులో ఇద్దరు స్పెషలిస్టులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఆప్తాలమిక్ వైద్యుడు అందుబాటులో ఉంటారని ప్రభుత్వం చెబుతోంది. అయితే తొలివిడతలో మాత్రం అరకొర వైద్యులే సేవలందించారు. గ్రామీణ ప్రాంతాల్లో 91 రకాల మందులు, అర్బన్ ప్రాంతాల్లో 172 రకాల మందులను ఉచితంగా అందించనున్నట్టు వైద్యారోగ్యశాఖ ప్రకటించింది. తొలివిడతలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, టీబీ, మలేరియా, టైఫాయిడ్‌ల నిర్ధారణ పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు పరీక్షలు చేస్తామని చెప్పినా అప్పట్లో క్షేత్రస్థాయిలో అటువంటివేవీ చేసిన దాఖలాలు లేవు. రెండో విడతలో అయినా.. సక్రమంగా సేవలు అందుతాయో లేదోనన్నది చర్చనీయాంశమవుతోంది. ఈ శిబిరాల పేరిట ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు.

తెగ తాగేశారు

- రెండు రోజుల్లో రూ.9.78కోట్ల మద్యం అమ్మకాలు
- ఖజానాకు భారీగా ఆదాయం

శ్రీకాకుళంక్రైం, జనవరి 2: కొత్త ఏడాది వేడుకల్లో మందుబాబులు తెగ తాగేశారు. దీంతో జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. రెండు రోజుల్లో ప్రభుత్వ ఖజానాకు రూ.9,78,28,300 ఆదాయం వచ్చింది. ఈ వివరాలను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు మంగళవారం విలేకరులకు వెల్లడించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆదివారం (డిసెంబరు 31), సోమవారం (జనవరి 1) అర్ధరాత్రి 12 వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో, అర్ధరాత్రి 1 గంట వరకు బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. ఆదివారం రూ.6,04,28,300, సోమవారం రూ.3.74 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయన్నారు. ఈ రెండు రోజుల్లో రూ.9,78,28,300 ఆదాయం ఎక్సైజ్ శాఖకు వచ్చిందని తెలిపారు. జిల్లాలో ఏ మద్యం దుకాణంలో కూడా కల్తీ జరగలేదని స్పష్టం చేశారు. మందుబాబులు బ్రాండెడ్ మద్యం అడుగుతున్నారని, ఈ మద్యం ఉంటే మరింత ఆదాయం సమకూరేదని తెలిపారు. గతేడాదితో పోలిస్తే డిసెంబరు 31 ఒక్కరోజు మద్యం అమ్మకాల ద్వారా 3.16 శాతం అధికంగా ఎక్సైజ్ శాఖకు ఆదాయం వచ్చిందని వివరించారు.

18 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

న్యూఇయర్ వేడుకల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా డిసెంబరు 31న 18 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో 14, టెక్కలిలో మూడు, కాశీబుగ్గలో ఒక కేసు చొప్పున నమోదయ్యాయి. గతేడాది మొత్తంలో 1,211 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా 1,146 కేసుల్లో మందుబాబులకు శిక్ష పడింది. వీరి నుంచి రూ.3,31,200 అపరాధ రుసుం వసూలు చేశారు. చార్జిషీట్ వేయనవి, కోర్టులో మరో 65 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

పశుగ్రాసం కొరత

- పెరిగిన ధరలు
- పాడి రైతులపై అదనపు భారం

(ఇచ్ఛాపురం రూరల్)



పాడి పశువులకు గ్రాసం కరువవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తర్వాత పాడి పశువుల పెంపకానికి రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ ఏడాది జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో చాలా మంది కూలీలు వలసబాట పట్టారు. ఆవులు, గేదెలు ఉన్న రైతులు స్థానికంగానే ఉంటున్నారు. అన్నదాతలు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు మేత దక్కని పరిస్థితి నెలకొంది. దీంతో పశుగ్రాసం ధర పెరిగింది. ఒక్క ట్రాక్టర్ గడ్డిలోడు రూ.5 వేలు పలుకుతోంది. ట్రాక్టర్‌తో ఆ గడ్డిని తరలించేందుకు బాడుగ, కూలీల ఖర్చులు మరో రూ.6 వేలకు పైగా ఖర్చవుతోంది. దీంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇతర గ్రామాల్లో వరిగడ్డి కొనే స్థోమత లేక కొందరు మూగజీవాలను విక్రయిస్తున్నారు. మూగ జీవాలను వదులుకోలేని రైతులు పశుగ్రాసం కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పంటల పెట్టుబడికి అప్పులపాలైనా.. పశువుల కోసం మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు. ఎన్నడూ ఇంత ధర పెరగడం చూడలేదని, పశుపోషణ భారమవుతోందని ఇచ్ఛాపురం మండలానికి చెందిన ఎస్.సింహాద్రి, బి.మాలయ్య తదితర రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పశుగ్రాసం పంపిణీ చేయాలని కోరుతున్నారు.



మునిసిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

అరసవల్లి, జనవరి 2: శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికులు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఎనిమిదో రోజు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పాదయాత్రలో, అసెంబ్లీ సాక్షిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. గ్రాట్యూటీ వర్తింపజేయాలి' అని వారు కోరారు. మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణరాజు, అర్జి రాము, శంకర్, అరుగుల రాము, ఏ.శేఖర్, బి.గణేష్, డి.సురేష్ కుమార్ ఎం.అప్పన్న, శివారం, డి.యుగంధర్, కె.బాలరాజు, నారాయణరావు, డి.సురేష్, అప్పన్న, పార్వతి, ఈశ్వరమ్మ, డి.లక్ష్మి, కె.అప్పలకొండ పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉరి తాళ్లు తగిలించుకుని నిరసన

అరసవల్లి, జనవరి 2: కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా 14వ రోజు మంగళవారం.. ఉరితాళ్లు తగిలించుకుని వినూత్న నిరసన తెలిపారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వాగ్దేవి సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'సమగ్రశిక్ష ఉద్యోగులకు పనిభారం తగ్గించాలి. సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. అన్ని పోస్టులకు జాబ్‌చార్ట్ ఇవ్వాలి. అన్ని సంక్షేమ పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాల'ని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, జేఏసీ ఉపాధ్యక్షుడు గిరిధర్, కార్యవర్గ సభ్యులు చీపురుదేవి, అరుణకుమారి, అనితాకుమారి, శివ, అరుంధతి, విమలకుమారి, ధనుంజయ, రమాదేవి, ప్రసాద్, యుగంధర్, గౌరీశంకర్, రోహిణి, రామినాయుడు, మహేష్, ఉపేంద్ర, అచ్యుతరావు, చిరంజీవి, చందు, శైలజ, ధనలక్ష్మి, చంద్రకళ, జ్యోతి పాల్గొన్నారు.



సారవకోట మండలం రామకృష్ణాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న బగ్గు రమణమూర్తి



మెళియాపుట్టి: వసుంధరలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న కలమట సాగర్

చంద్రబాబుతోనే పేదలకు మేలు

- బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకుల ప్రచారం

చంద్రబాబుతోనే పేదలకు మేలు జరుగుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం జిల్లాలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను ఇంటింటికి వెళ్లి వివరించి కరపత్రాలను అందజేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు.

● **జలుమూరు (సారవకోట):** టీడీపీ, జనసేన కూటమి పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని రామకృష్ణాపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి అధోగతి పాలైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీకమిటీ ప్రతినిధి దర్శాన తేజకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, పిల్లా నందకిశోర్, పట్ట ఉమామహేశ్వరరావు, పొదిలాపు వేణుగోపాలరావు,సాధు చిన్నికృష్ణంనాయుడు, బైరి భాస్కరరావు, బగ్గుగోవిందరావు,నాగరాజు, డి.జయరాం, తాడేల భీమారావు పాల్గొన్నారు.

● **మెళియాపుట్టి:** వసుందరలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్రప్రధానకార్యదర్శి కలమట సాగర్ మాట్లాడుతూ మళ్లీ చంద్రబాబు వస్తేనే పేదలుకు మేలు జరుగుతుందని తెలిపారు.

దివ్యాంగులకు తీరని అన్యాయం

● టీడీపీ జిల్లా దివ్యాంగుల విభాగం కార్యదర్శి వెంకటరమణ

జలుమూరు: వైసీపీ పాలనలో దివ్యాంగులకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ జిల్లా దివ్యాంగుల విభాగం కార్యదర్శి గురుబెల్లి వెంకటరమణ ఆరోపించారు. మంగళవారం జలుమూరులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో దివ్యాంగుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులకు, తదితర పింఛన్‌దారులకు నెలకు రు.3,000 చేసిన ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లపై పట్టించుకోకపోవడం దారుణమన్నారు. టీడీపీ హయాంలో దివ్యాంగులకు ప్రత్యేక పింఛన్‌విధానంతోపాటు సబ్సిడీతో కూడిన రుణాలు, పరికరాలు అందించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో సకలాంగులకు పింఛన్లు పెంచి దివ్యాంగులకువిడిచిపెట్టడం సరికాదనితెలిపారు. సకలాంగులకు ఇచ్చే పింఛన్‌కు రెట్టింపు దివ్యాంగులకు పింఛన్లు అందచేసి ఆదుకోవాలని కోరారు. లేకపోతే రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పడానికి దివ్యాంగులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలలో వసతులు కల్పించాలి

టెక్కలి:డిగ్రీకళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పరీక్షఫీజులు వెంటనే కట్టించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐనాయకులు డిమాండ్‌చేశారు. మంగళవారం టెక్కలిలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నానిర్వహించారు.తొలుత ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీచేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యు.దుర్గాప్రసాద్, మానస వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ అపరాధ రుసుముతో ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడం తగదని, విద్య ఓర్స్ యాప్‌ను రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో తరుణ్, మహేష్ పాల్గొన్నారు.

మద్యం సేవించిన వారిపై చర్య తీసుకోవాలి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలమట సాగర్

మెళియాపుట్టి: రట్టిణి పంచాయతీ కార్యాలయంలో మద్యం సేవించిన అధికార పార్టీ నాయకులతో పాటు వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి కలమట సాగర్, పాతపట్నం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో చంద్రకుమారి, ఎస్‌ఐ టి.రాజేష్ ఫిర్యాదుచేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో పార్టీ కార్యాలయం శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చింతల ప్రశాంత్ మద్యం సేవించడంపై సోషల్‌మీడియాలో పెట్టారన్న ఉద్దేశంతో సోమవారం రాత్రి ఇంటిపైకి వెళ్లి దాడిచేశారని పోలీసులకు జనసేన,టీడీపీ నాయకులు ఫిర్యాదుచేశారు. కార్యాలయం తాళాలు పంచాయతీ అధికారులవద్ద ఉండవలసి ఉండగా ఎందుకు వైసీపీ నాయకులకు వలంటీర్లు ఇచ్చారని ప్రశ్నించారు.ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం వైసీపీ కార్యకర్తలు,నాయకులకు అలవాటుగా మారిందన్నారు. మద్యంసేవించిన అధికారులపై కేసులు నమోదుచేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వసంత్, శ్రీధర్, శ్రీను, చక్రి, భాస్కరరావు,జనసేన నాయకులు దుక్క బాలరాజ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఒడిశా మద్యం సీసాలు స్వాధీనం

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఒడిశా మద్యం సీసాలు తరలిస్తూ రంకిణికి చెందిన యువకుడు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. తరలింపునకు వినియోగించిన ద్విచక్రవాహనాన్ని, ఆరు బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈమేరకు ఎస్‌ఐ మహమ్మద్ యాశిన్ కేసు నమోదుచేశారు.

7న నవోదయ మోడల్ పరీక్ష

నరసన్నపేట: జమ్ము జనజాగృతి సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన నరసన్నపేట గీతాంజలి స్కూల్‌లో నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు, తహసీల్దార్ సాధు దిలీప్‌చక్రవర్తి ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు 97038 71811, 9908856286 నెంబర్లుకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

డ్రైవర్లపై ఆంక్షలు తగవు

టెక్కలి: కేంద్రప్రభుత్వం లారీడ్రైవర్లపై ఆంక్షలు విధించడం తగవని లారీ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు నగేష్ పేర్కొన్నారు. మంగళవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ కొత్తచట్టాల వల్ల రవాణా రంగం స్తంభించే అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికే డ్రైవర్ల కొరత ఉందని చెప్పారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఐపీసీ సెక్షన్లు కొన్ని మార్పులుచేయాలని డిమాండ్ చేశారు.

రాముడి అక్షింతలు పంపిణీ

మందస: అయోధ్య నుంచి మందస జగన్నాథస్వామి ఆలయానికి వచ్చి అయోధ్య ఆలయ అక్షింతల పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. అయోధ్య ఆలయ ఫోటోతో పాటు అక్షింతలను అందజేశారు. ● **నందిగాం:** అయోధ్యలో ఈనెల 22న రామాలయం ప్రతిష్ఠ పురస్కరించుకొని గ్రామాల్లో అక్షింతలు పంపిణీ చేపట్టారు. ఆలయాలు ప్రాంగణాల్లో ప్రత్యేకపూజలు చేసి పురవీధుల్లో ఇంటింటికి అక్షింతలు అందించారు. ఈసందర్భంగా వీహెచ్‌పీ, సమరసత సేవాఫౌండేషన్ బృందాల నేతృత్వంలో ఈనెల 22న ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంటిముందు దీపాలు వెలిగించి దీపోత్సవం నిర్వహించాలని సూచించారు.

పంచాయతీల్లో గ్రామసభలు

టెక్కలి రూరల్: టెక్కలి పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు కీలకమని సర్పంచ్ గొండేల సుజాత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పీతల హేమలత, స్థానిక గ్రామసచివాలయం-3 కన్వీనర్ గోపీనాథ్ బెహరా పాల్గొన్నారు. ●**నరసన్నపేట:** నరసన్నపేట పంచాయతీలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, కళాశాలరోడ్డు దుకాణాలు రోడ్డుపై వేయడంతో ట్రాఫిక్ సమస్య తెలెత్తుతోందనిసభ్యులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ బూరెళ్ల శంకరరావు అధ్యక్షతనపంచాయతీ గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో చిన్నారావు, వార్డు సభ్యులు కోరాడ చంద్రభూషణగుప్త, వార్డు సభ్యులు శర్మ, ఈవో ఆర్‌డీ రామకృష్ణ పాల్గొన్నారు.

సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయి



మోహనరావు దంపతులను సత్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకులు

పలాస: ప్రతిఉద్యోగికి సేవలు గుర్తింపునిస్తాయని వక్తలు తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో జూనియర్ అకౌంట్ అధికారి (జేఏవో)గా పనిచేసి పదవీవిరమణ చేసిన దువ్వాడ మోహనరావుకు ఉద్యోగసంఘ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా విద్యుత్‌ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎంవీ గోపాలరావు మాట్లాడుతూ ఉద్యోగులతోపాటు వినియోగదారులతో కూడా మోహనరావు సఖ్యతగా ఉండేవారని,ఎటువంటి సమస్యనైనా చాకచక్యంగా పరిష్కరించేవారని గుర్తుచేశారు. ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పదన్నారు. అనంతరం మోహనరావు దంపతులకు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు,రీజినల్‌అధ్యక్షుడు ఎన్.లోకేశ్వరరావు, బ్రాంచ్ అధ్యక్షుడు గార రాజారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్, కోశాధికారి ఎం.హిమగిరి, కె.గిరి, కె.ఈశ్వరరావు, తమ్మినేని గంగారామ్‌తో పాటు శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి, పలాస పరిధిలో ఉన్న విద్యుత్ ఉద్యోగులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

బతుకు మారాలంటే బాబు రావాలి

● రాష్ట్ర రైతు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘ నాయకుడు అశోక్



కోటబొమ్మాళి: అశోక్‌కు సంఘీభావం తెలుపుతున్న రమేష్

నరసన్నపేట:పేదలబతుకుల మారాలంటే సీఎంగా నారా చంద్రబాబునాయుడు రావాలని రాష్ట్ర రైతు ఎస్సీ, ఎస్టీబీసీ సంక్షేమ సంఘ నాయకుడు చింతల అశోక్ పిలుపునిచ్చారు.చంద్రబాబునాయుడు సీఎం కావాలని ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు అశోక్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం నరసన్నపేట చేరింది. ఈసందర్భంగాఅన్నివర్గాల అభ్యున్నతికి సీఎంగా చంద్రబాబునాయుడు రావల్సిన అవసరంఉందన్నారు. స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ●**కోటబొమ్మాళి:**కోటబొమ్మాళిలో టీడీపీ మండలాధ్యక్షుడు బోయిన రమేష్ టీడీపీ కార్యకర్తలతో కలిసి చింతలఅశోక్‌కు సంఘీభావం తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సోమవారం సాయంత్రం కోటబొమ్మాళి చేరుకోవడంతోరాత్రికి టీడీపీ కార్యాలయంలో బసచేసి మంగళవారం ఉదయం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు బొమ్మాళి ప్రసాదరావు, మజ్జి కృష్ణారావు, మెట్ట మోహనరావు, ముద్దుబాబు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

నందిగాం: ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లర్ల దోపిడీపై మంగళవారం డీటీ ఎస్.భాగ్యలక్ష్మికి నందిగాం రైతులు వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు 80 కేజీలు కాకుండా 82 కేజీలు బస్తాగా తీసుకొని అన్‌లోడింగ్, లేబర్ చార్జీల పేరుతో వివిధ రకాలుగా వసూలు చేసి రైతుల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈవిషయంపై విచారణ నిర్వహించి రైతులకు న్యాయంచేయాలని కోరారు.

యువత పోటీతత్వం అలవరచుకోవాలి: సర్పంచ్

● గురుదాసుపురంలో ఉత్తరాంధ్ర స్థాయి నృత్య పోటీలు



విజేతగా నిలిచిన ఇచ్ఛాపురం జట్టు

పలాస రూరల్: యువత పోటీతత్వాన్ని అలవరచుకోవాలని గురుదాసుపురం సర్పంచ్ కుత్తుమ రూప తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని గురుదాసుపురం స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని ఉత్తరాంధ్రస్థాయి నృత్యపోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత అన్నిరంగాల్లో ముందుంటున్నారని, ఉత్తరాంధ్ర స్థాయి నృత్య పోటీలు మన ప్రాంతంలో నిర్వహించి యువతలో ప్రతిభను వెలికితీసేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా 30 టీమ్‌లకు పైగా పోటీ పడగా, న్యాయనిర్ణేతలుగా డీ కొరియోగ్రాఫర్లు అమిత్,కుమార్ మాస్టార్లు ఆర్డీఎక్స్ కొరియోగ్రాఫర్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలుగా గ్రూప్ విభాగంలో ప్రథమ,ద్వితీయ,తృతీయ విభాగంలో లిటిల్‌ఏంజిల్స్ (ఇచ్ఛాపురం), ఎండీఎస్ జట్టు(సోంపేట),లిటిల్‌స్టార్(ఇచ్ఛాపురం), డ్యూయెట్‌లో రాజేష్-చంటి గ్రూప్(పలాస), కోటబొమ్మాళి టీమ్, టెక్కలిటీమ్‌లు, సోలో విభాగంలో కిరణ్ (కొర్లాం), ఆర్డీఎక్స్ జట్టు, చినబరంపురంటీమ్ విజయం సాధించడంతో నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలోసంఘ అధ్యక్షుడు ఎస్.ప్రేమ్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు ఢిల్లేశ్వరరావు కె.ప్రతాప్, సొర్ర కామేశ్, గ్రామకుల నాయుడు ఢిల్లీరావు, దున్న తారకేశ్వరరావు పాల్గొన్నారు.

వివిధ కుటుంబాలను కలిసిన కలమట



కలమట వెంకటరమణతో టీడీపీ నాయకులు

కొత్తూరు:కర్లెమ్మ పంచాయతీలకు చెందిన పొగిరి అర్జునరావు, చోడవరపు జోగినాయుడు, శ్రీరాములునాయుడు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మంగళవారం కలిశారు. ఆయన వెంట టీడీపీనాయకులు పి.మోహన్‌రావు, సర్పంచ్‌లు లోతుగెడ్డ భగవాన్‌దాసునాయడు, నెల్లి అచ్యుతరావు, లోకేష్, ముగితి కృష్ణ, పెద్దిన అమర్, మడపాన రాజారావు, బర్రి గోవిందరావు, లక్ష్మణ ఉన్నారు.

వ్యాసరచనలో సత్తాచాటిన విద్యార్థిని

పలాస రూరల్:బ్రాహ్మణతర్లా జడ్పీ ఉన్నతపాఠశాల ప్లస్‌ఇంటర్ విద్యార్థిని టి.త్రివేణి ప్రకృతియే గురువు అన్న అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో సత్తాచాటింది. జిల్లాలో ప్రథమ స్థానం సాధించడంతో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అభినందించారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

నరసన్నపేట:శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌ను బుధవారం ముట్టడించనున్నట్లు యూటీఎఫ్ జిల్లాప్రధాన కార్యాదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు.ఒకటోతేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు.

13న రాష్ట్ర స్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలో ఈనెల 13న రాష్ట్రస్థాయి ఓపెన్ క్విజ్‌పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ఒకప్రకటనలో తెలిపింది.పోటీలకు అందరూ అర్హులేనని, ఎంట్రీఫీజు లేదని పేర్కొంది. వివరాలకు 7680825355 పోన్ నెంబరుకు సంప్రదించాలని కోరింది.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు: జేడీ

టెక్కలి: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు ఎం.కిషోర్ తెలిపారు. మంగళవారం మండలంలోని లింగాలవలసలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దువ్వాడ వాణి, ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జయరాజ్, ఏడీలు డాక్టర్ కిషోర్, డాక్టర్ రఘునాథ్, పశువైద్యులు డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ చక్రవర్తి, సర్పంచ్ సంపతిరావు లక్ష్మి రాఘవరావు, శ్రీలత పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా స్టాలిన్

టెక్కలి: టెక్కలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు డీఏ స్టాలిన్‌కు హ్యూమన్ రైట్స్ మిషన్(హెచ్‌ఆర్‌ఎం) జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. మంగళవారం హ్యూమన్‌రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్‌నాయక్, విశ్రాంత జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.ప్రభాకర్ ఉత్తర్వులను అందజేశారు.ఈసందర్భంగా డీఏ స్టాలిన్‌కు పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రేణంకి రామచంద్రరావు, కార్యదర్శి ధనుంజయరావు అభినందించారు.


ఇచ్ఛాపురం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


ఎచ్చెర్ల: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు


ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


గార: పూసర్లపాడు సచివాలయం వద్ద వీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- తక్షణమే సమస్యలు పరిష్కరించాలి
- 22వ రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరసన

ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరారు. మంగళవారానికి అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పొందూరు: ఒంటికాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


పాతపట్నంలో..


హిరమండలం సచివాలయంలో..


జలుమూరు: టెక్కలిపాడులో సచివాలయంలో..


పలాస రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన


మందస: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు


సారవకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట

ఐదో తేదీలోగా విధుల్లో చేరాలి

శ్రీకాకుళం,(ఆంధ్రజ్యోతి)/కోటబొమ్మాళి/ టెక్కలి/ నరసన్నపేట: సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ నెల 5వ తేదీలోగా విధుల్లోకి చేరాలి.. లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం నుంచి హెచ్చరిక జారీచేస్తూ కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట ప్రాంతాల్లో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ శిబిరాలను ఐసీడీఎస్ పీడీ శాంతి శ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమ్మె విరమించాలని ఇప్పటికే షోకాజ్ నోటీలు జారీ చేసినట్టు తెలిపారు. కొన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. హామీలు అమలు చేసే వరకూ సమ్మె విరమించేదిలేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.


కోటబొమ్మాళి: నిరసన శిబిరం వద్ద అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న పీడీ శాంతిశ్రీ

ఐసీడీఎస్ అధికారుల నిలదీత

పలాస రూరల్: కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో మంగళవారం ఐసీడీఎస్ అధికారులు వ్యాన్‌లో తరలిస్తుండగా అంగన్‌వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. తాము లేకుండా పౌష్టికాహార పంపిణీ ఎలా చేస్తారంటే ఐసీడీఎస్ అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకొని వ్యాన్‌ను వదలాలని, లేకపోతే కేసులు పెడతామని హెచ్చరించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. 22 రోజులుగా సమస్యల పరిష్కారానికి ధర్నాచేస్తున్నామని, పోలీసులు కూడా సహకరించకపోతే ఎలా అని కార్యకర్తలు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సీఐటీయూ నాయకుల సూచనల మేరకు వ్యాన్‌ను విడిచిపెట్టడంతో వివాదం సద్దుమణిగింది.


పౌష్టికాహార వ్యాన్‌ను అడ్డుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆటో బోల్తా.. యువకుడి దుర్మరణం


శ్రీకాంత్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: పెద్దపాడు రోడ్డులో ఆటో బోల్తాపడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండలం తంగివానిపేట గ్రామానికి చెందిన శిమ్మ శ్రీకాంత్ (21) అనే యువకుడు కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం అర్థరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో శ్రీకాంత్.. శ్రీకాకుళం నగరానికి చెందిన గెడ్డవలస మోహన్ ఆటోలో శ్రీకాకుళం నుంచి ఇంటికి వెళ్తుండగా వెళ్త న్నాడు. ఓ షోరూం సమీపంలో ఇంటి నిర్మాణం కోసం రోడ్డుపై వేసిన ఇసుక కుప్ప మీద నుంచి ఆటో వెళ్లడంతో బోల్తా పడింది. శ్రీకాంత్‌పై ఆటో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మోహన్‌ను స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎ.విజయకుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- ఏఎస్ఐకి త్రుటిలో తప్పిన ప్రమాదం

శ్రీకాకుళం క్రైం: లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఏఎస్ఐకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న పీపీ రమణ మంగళవారం ఉదయం విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం వస్తున్నారు. కిమ్స్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో ఉన్న లారీని డ్రైవర్ ఆదినారాయణ వెనుక నుంచి రహదారి మీదకు ఎక్కిస్తూ ఏఎస్ఐ వాహనాన్ని ఢీకొన్నాడు. అయితే బైక్‌పై నెమ్మదిగా వస్తున్న ఏఎస్ఐ వెంటనే వాహనం మీద నుంచి దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం కొద్దిగా దెబ్బతింది.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

- స్థానికుల ఆందోళన.. ట్రాఫిక్‌కు అంతరాయం


ఆందోళన చేస్తున్న స్థానికులు

బూర్జ: రాజుపేట జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సుంకురాడ గ్రామానికి సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాజుపేట జంక్షన్ వద్ద పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్త న్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో సత్యనారాయణ రెండు కాళ్లకు తీవ్రగా యాలయ్యాయి. క్షతగాత్రుడ్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా స్థానికులు ఆగ్రహించి పాలకొండ వైపు వెళ్తున్న బస్సులను నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు సర్దిచెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: నగరానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్టు ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరానికి చెందిన సురేష్‌బాబు.. తిరుమల అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. తిరుమల బాకర్ సాహెబ్‌పేట సమీపంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తుంది. అయితే గత 29న విధులకు వెళ్తానని, పిల్లలను స్కూల్‌లో దింపి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాకపోవడంతో భర్త అన్నిచోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం ఒకటోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై షాపు యజమానిని పోలీసులు విచారించగా.. నాలుగు రోజుల కితం రూ.20 వేలు అప్పు తీసుకుని వెళ్లిందని, గత నెల 29వ తేదీ నుంచి పనిలోకి రావడం లేదని తెలిపారు. దీంతో ఎస్ఐ బలివాడ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డితాండ్రలో బాలిక..

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డితాండ్ర గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్టు నౌపడ ఎస్ఐ కిశోర్ వర్మ తెలిపారు. తన కుమార్తె కనిపించడం లేదని, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి ఊర్మిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

నేడు క్రికెట్ జట్టు ఎంపిక

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున క్రికెట్ క్రీడాకారులు ఎంపిక బుధవారం స్థానిక శివానీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్టు వర్సిటీ స్పోర్ట్స్ డీన్ పీలా సుజాత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు వర్సిటీ తరఫున అంతర్ వర్సిటీ క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని, ఆసక్తి గల వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు హాజరు కావాలన్నారు.

పారదర్శకంగా పథకాలు అమలు


ఆమదాలవలస: జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నుంచి నాటి నుంచి అట్టడుగులవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం బెలమాం గామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ కనుగల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు


స్వాగతం పలుకుతున్న గొండు శంకర్ తదితరులు

అరసవల్లి/శ్రీకాకుళం క్రైమ: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని టీడీపీ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతల అశోక్ ఇచ్ఛాపురం నుంచి తిరుమల వరకు చేపట్టిన 1200 కిలోమీటర్ల పాదయాత్ర మంగళవారం సింగుపురం చేరుకుంది. ఈ సందర్భంగా గొండు శంకర్ ఈ పాదయాత్రకు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సింగుపురం ఎంపీటీసీ పంగ సత్యనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు రెడ్డి శంకర్, ఎండు అమ్మన్నారావు, పంగ రమేష్, గొండు సింహాచలం, సోమినేని ప్రసాద్, శిమ్మ శ్యామసుందర్, సాధు గణపతి, బలగ శ్రీను, తవిటి శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద మార్కెట్‌కు మోక్షం


చెత్తను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ జల్లుతున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు గత కొద్ది రోజులుగా సమ్మెబాట పట్టడంతో నగరం చెత్తమయమైంది. దీనిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఎటు చూసినా చెత్తే' కథనం ప్రచురితమైంది. దీనిపై నగర పాలక కమిషనర్ స్పందించారు. స్థానిక పెద్దమార్కెట్‌లో పేరుకుపోయిన కూరగాయల వ్యర్థాల చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ గణేష్ మార్కెట్‌లో చెత్తను తొలగించి, వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ జల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఓబులేష్ మాట్లాడుతూ.. కార్మికుల సమ్మె కారణంగా చెత్త తొలగించడం ఆలస్యమైందని, దశల వారీగా చెత్త తొలగించే పనులు చేపట్టామన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

కంచిలి: క్రీడలతోనే మానసికోల్లాసం ఉంటుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. బూరగాంలో గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బ్యాటింగ్ చేయగా, దాసరి రాజు బౌలింగ్ చేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు రాజేశ్వరి, అప్పారావు, బంగారు కురయ్య, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, టీవీ రమణ, వి.రమేష్‌రెడ్డి, మన్మథరావు, పైల సూర్యనారాయణ, డొక్కరి ఈశ్వరరావు, శాంతారావు, బడేగాంధీ, హరికృష్ణ, హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వం అవసరం

అరసవల్లి: ఆంధ్రరాష్ట్ర ప్రగతికి చంద్రబాబు నాయకత్వం అవసరమని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం అరసవల్లిలో గల తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమైపోయాయని, అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో తన అనుభవం, దూరదృష్టి, కష్టించేతత్వంతో చంద్రబాబు మాత్రమే రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించగలరని, ఈ విషయాన్ని ప్రజలు కూడా నమ్ముతున్నారన్నారు.

అందుబాటులో వైద్య సేవలు


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్

గార: ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉంచాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ అన్నారు. మంగళవారం ఉదయం అంపోలు పంచాయతీ రామకృష్ణాపురం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ జయరామ్ ఎంపీడీవో ఎస్.రమణయ్య శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.మనోజ్ బాబు, వీవీఎస్ మూర్తితోపాటు ఇద్దరు గైనకాలజిస్టులు శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- బూర్జ: తోటవాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో మీనాక్షి హాజరై పరిశీలించారు రిమ్స్ వైద్యులు, గుత్తావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పైడి రోజా, ఎంపీడీవో రవీంద్రబాబు, సచివాలయాల కన్వీనర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలి


టీడీపీ మండల నాయకులతో మాట్లాడుతున్న కళావెంకటరావు

జి.సిగడాం: శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో ఈ నెల 3, 4 తేదీల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటించనున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక దవళపేటలో రిటైర్డు సైనికుడు కంచరాన అసిరినాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం దవళపేట వస్తున్నారని, టీడీపీ శ్రేణులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు కుమారావు రవికుమార్, కంచరాన సూరన్నాయుడు, బెవర జగన్నాథరావు, టంకాల మౌళీశ్వరరావు, ఆరెళ్ల గొల్లాజీ, చిత్తిరి అసిరినాయుడు, వెంకటరావు, విక్రం సత్యారావు, బంగారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ఫీజులను వెంటనే రద్దు చేయాలి

అరసవల్లి: డిగ్రీ కళాశాలలో పెంచిన స్పెషల్ ఫీజులను వెంటనే రద్దు చేయాలని, అలాగే యాప్ ద్వారా ఫీజులు చెల్లించడాన్ని నిలుపుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డెవలప్‌మెంట్ కోసం విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడం దారుణమని, ప్రభుత్వమే కళాశాలకు నిధులివ్వాలని కోరారు. వెంటనే ఫీజులను రద్దు చేయకపోతే జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

జగనన్నా.. హామీలు అమలు చేయన్నా!


ఆమదాలవలస: ఒంటికాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇచ్ఛాపురం: పాదయాత్రలో అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ అన్నారు. సమ్మెలో భాగంగా మంగళవారం పారిశుధ్య కార్మికులు డప్పులు వాయించుకొని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ జంక్షన్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి నిరసనలు తెలిపారు.

- ఆమదాలవలస: మున్సిపల్ కార్మికుల సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరింది. ఆమదాలవలస మున్సిపల్ కార్మికులు ఒంటి కాళ్లపై నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. నాయకులు సంతోష్, కె.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, వాసు పాల్గొన్నారు.

బెంతుల సమస్యలు పరిష్కరించండి


నినాదాలు చేస్తున్న మహిళలు

కవిటి: బెంతు ఒరియా కులస్థుల సమస్యలు పరిష్కరించే వరకు రిలే నిరాహార దీక్షలు చేస్తుంటామని బెంతు ఒరియా కులస్థులు తెలిపారు. మంగళవారం బల్లిపుట్టుగ బెంతు మహిళలు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మేనక దొలాయి, మోహిని దొలాయి, అంజలి, సుజాత పాల్గొన్నారు.

6న ఆశీలు వసూలుకు వేలం పాట

శ్రీకాకుళం క్రైం: నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్, రోడ్ మార్జిన్స్‌లో (ఏడు విలీన గ్రామ పంచాయతీలతో సహా) 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆశీలు వసూలు చేసేందుకు ఈ నెల 6న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు కమిషనర్ చల్లా ఓబులేసు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 లక్షలు సాల్వెన్సీ, రూ.3 లక్షలు ధరావత్తు చెల్లించాలన్నారు. ఆసక్తి గల పాటదారులు 6వ తేదీ ఉదయం 10.30కి నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జేఆర్ పురం సీఐగా రామచంద్రరావు


బాధ్యతలు చేపడుతున్న సీఐ రామచంద్రరావు

రణస్థలం: జేఆర్ పురం సీఐగా జి.రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఆదాం బదిలీపై విశాఖ వెళ్లారు. ఆనందపురం సీఐగా విధులు నిర్వహించిన రామచంద్రరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇంటింటికీ శ్రీరాముడి పూజిత అక్షింతలు

శ్రీకాకుళం క్రైం: విశ్వహిందూ పరిషత్ వారి సహకారంతో ఇంటింటికీ అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంచిపెట్టారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి రావాడ రాజశేఖర్, ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ వైస్ చైర్మన్ పాలకొండ ప్రశాంత్ నక్కవీధిలో ఉన్న సుమారు 150 ఇళ్లకు వెళ్లి అక్షింతలతో పాటు శ్రీరాముని చిత్రపటం, కరపత్రం అందించారు.

- ఎచ్చెర్ల: ఎస్ఎం పురం గ్రామ పంచాయతీలో అయోధ్య అక్షంతల పంపిణీ మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్, బీజేపీ మండల అధ్యక్షుడు సంపతిరావు నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గొంటి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.
- రణస్థలం: అయోధ్య రాములవారి సన్నిధానం నుంచి తెచ్చిన అక్షింతలు ఇంటింటికీ అందించే కార్యక్రమం రామ భక్తులు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరరావుకు విశ్వహిందూ పరిషత్ ధర్మప్రసార ప్రముఖ్ పొగిరి సూర్యనారాయణ, వేదపండితులు బాలకృష్ణశర్మ అక్షింతలు అందజేసి, ఆశీర్వచనం చేశారు. ఆలయ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరారు.